క్లుప్తంగా

ఆర్టీసీ డిపోలో అధునాతన వసతులు



గుడివాడటౌన్: గుడివాడ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు అధునాతన వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు కృష్ణాజిల్లా ప్రజా రవాణా అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్టీసీ డిపోలో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. నూతనంగా నిర్మిస్తున్న హెచ్ఎస్‌డీ బంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఉద్యోగుల విశ్రాంత గది, మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్‌తో పాటు అన్ని సెక్షన్‌లలో తనిఖీలు చేశారు. వాహనాల రోడ్ టెస్ట్ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ డి.రాజేష్ కుమార్, సీఐ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



గుడివాడటౌన్: స్థానిక వాసవీచౌక్‌లో వేం చేసి ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు మాట్లాడుతూ.. ప్రతి నెల పునర్వసు నక్షత్రాన్ని(అమ్మవారి నక్షత్రం) పురస్కరించుకుని ఈ చండీ హోమం నిర్వహిస్తున్నామన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య జరిగిన ఈ హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు కోరుతూ ఈ హోమం నిర్వహించామని గంగరాజు తెలిపారు. జగ్గారావు, దుడ్డు చిన్నా, టీఎస్‌వీ సాంబశివరావు, చిన్నం గంగాధరరావు, పోకూరి మోహన్‌రావు, సీహెచ్ వెంకన్నబాబు పాల్గొన్నారు.

రోటరీ సాయం సద్వినియోగం చేసుకోవాలి

తోట్లవల్లూరు: రోటరీ క్లబ్ చేయూతను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని యాకమూరుకు చెందిన కె.రవికి క్లబ్ తరఫున రూ.30 వేల విలువైన బార్బర్ షాపును ఆయన గురువారం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి అమీర్ మీర్జా, చొప్పరపు వెంకటేశ్వరరావు, తల్లం హనుమంతరావు, గడ్డం సాయికల్యాణ్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

నూరు శాతం సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి మాగాణి పొలాల్లో గట్లపై సాగు చేసుకోవటానికి రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. మండలానికి కేటాయించిన నాలుగు క్వింటాళ్ల విత్తనాల్లో భట్లపెనుమర్రు, కాజ-1, కాజ-2, కోసూరు సచివాలయాలకు 28 కిలోల చొప్పున మిగిలిన 12 సచివాలయాలకు 24 కిలోల చొప్పున కేటాయించారు. దీనిలో భాగంగానే మండల వ్యవసాయ శాఖాధికారి బి.సురేష్ బాబు నాయక్ పర్యవేక్షణలో కూచిపూడి సచివాలయ వ్యవసాయ సహాయకురాలు ఎం.శ్రావణి పంచాయతీలో విత్తనాలను అందజేశారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సత్కారం



మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న బి.సురేష్‌ని ఉన్నతాధికారులు విజయవాడలోని చుట్టుగుంట మలేరియా డిపార్ట్‌మెంట్‌కి బదిలీ చేశారు. బదిలీపై వెళ్లిన సురేష్‌ను గురువారం తక్కెళ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని లోకుమూడి వెల్‌నెస్ సెంటర్‌లోని వైద్యులు సుమ, జోషిమ్మ శాలువాతో సత్కరించారు.

వరహాపట్నం రోడ్డుకు మరమ్మతులు



కైకలూరు: అధిక లోడు వాహనాల వల్ల దెబ్బతిన్న వరహాపట్నం రోడ్డు మరమ్మతులను గురువారం ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉప్పలపాటి జయదేవ్, గ్రామ పంచాయతీ సెక్రటరీ సాయితేజ ఆధ్వర్యంలో ముందుగా రోడ్డుపై పడిన గుంతల్లో నీటిని తోడడానికి పొక్లెయిన్‌తో డ్రెయిన్లను ఏర్పాటు చేశారు. మోటార్లతో నీటిని డ్రెయిన్లకు తరలించి గుంతలు పూడుస్తామని తెలిపారు.

వరద ముంపులో వరి పొలాలు



కపిలేశ్వరపురం పరిధిలో ముంపులో ఉన్న పొలాలు



తాడంకి పొలాల్లో నిలిచిన వర్షం నీరు

- 3 వేల ఎకరాలు నీటమునక
- కొద్ది రోజులుగా ముంపులోనే పల్లపు పొలాలు
- కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ లోపమే కారణం
- మళ్లీ నాట్లు వేసుకోవాలని అన్నదాతల ఆవేదన

పమిడిముక్కల: గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న మురుగు నీరు, డ్రెయిన్‌ల్లో నీటి పారుదల సరిగా లేక, పల్లపు భూములు ముంపులోనే ఉన్నాయి. కపిలేశ్వరపురం, మంటాడ, గరికపర్రు, వేల్పూరు పరిధిలోని వెయ్యి ఎకరాలకుపైగా ముంపులో ఉన్నాయి. తాడంకి, గురజాడ, మంటాడ, గోపువాపాలెం పరిధిలోని 1500 ఎకరాల బాడవ పొలాలు ముంపు బారిన పడ్డాయి. చంద్రయ్య డ్రెయిన్ పూడిపోవడం వల్ల మురుగునీరు పోయే మార్గం లేక గురజాడ, ఉయ్యూరు పరిధిలోని 500 ఎకరాలు నీటిలోనే నానుతున్నాయి. పొలాల్లోని మురుగు బయటకు పోక రైతులు అవస్థలు పడుతున్నారు. నాట్లు వేసిన పొలాలు ముంపు బారిన పడి పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు సక్రమంగా అందకపోయిన బోర్ల కింద నారుమడులు పోసుకొని, వరి నాట్లు వేసుకొన్నామని చెబుతున్నారు. మళ్లీ వరి నాట్లు వేసుకోవాలంటే ఖర్చు తడిసిమోపుడు అవుతుందని ఆందోళన చెందుతున్నారు. కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే పొలాలు ముంపు బారిన పడ్డాయని, మరమ్మతులు చేపట్టి మురుగునీరు పోయే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

చంద్రయ్య డ్రెయిన్ బాగు చేయాలి..



చంద్రయ్య డ్రెయిన్ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో పూర్తిగా పూడిపోయింది. పొలాల్లోని మురుగు పోయే మార్గం లేక గురజాడ, ఉయ్యూరు పరిధిలోని పంటపొలాలు ముంపులో ఉన్నాయి. డ్రెయిన్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి మురుగు పోయే ఏర్పాట్లు చేయాలి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయాం.

– జంపాన శ్రీమన్నారాయణ, రైతు, గురజాడ

అధికారులు ఆదుకోవాలి..



బాడవలో 12 ఎకరాలు కౌలు చేస్తున్నాను. ఇప్పటి వరకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టాను. డ్రెయిన్లు సరిగా లేక పొలాలు ముంపునకు గురయ్యాయి. కొద్ది రోజులుగా ముంపులోనే పంట ఉండడంతో దెబ్బతింది. మళ్లీ నాట్లు వేయాలంటే ఖర్చు బాగా పెరుగుతుంది. అధికారులు పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలి.

– బాకి ఆదినారాయణ, కౌలురైతు, తాడంకి

బాబు సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్ వేదికపై నాయకులు

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పెదపారుపూడి: చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయటం చేతకాక పోయిన సూపర్ సిక్స్ – మోసం ఫిక్స్ అనేలా ప్రజలను మోసం చేశారని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ మండిపడ్డారు. మండల పరిధిలోని దోసపాడు గ్రామంలోని కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కైలే మాట్లాడుతూ.. చంద్రబాబు చెప్పిన అన్ని అబద్ధాల వాగ్దానాలు రాష్ట్ర రాజకీయాల్లో ఇంత వరకు ఎవరు చెప్పలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను నీరుగార్చిన అసమర్థుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు.
సంక్షేమ పథకాలు ఇవ్వకుండా చేస్తున్న అప్పుల తాలూకా డబ్బులు ఏమీ చేస్తున్నారని నిలదీశారు. మండలాల్లో కూటమి నాయకులు అడ్డగోలుగా రెచ్చిపోతున్నారన్నారు. చంద్రబాబు మోసాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికారి ప్రతినిధి చీకుర్తి వరప్రసాద్, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ ఆల రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, నాయకులు మూల్పూరి చంద్రశేఖర్, బొడ్డు రమేష్, జాజుల చిన్నారి, నమా వెంకటేశ్వరరావు, చిగురుపాటి శ్రీధర్, అశోక్, చేబ్రోలు సుజాత, పాతూరి రమేష్, పుణుకొల్లు శివరాం, కుమ్మరి రాజేష్, గోళ్ల సోమేశ్వరరావు, ఎలిసి డేవిడ్‌రాజు, కలుగురి వెంకటేశ్వరరావు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

27న గోదాదేవి వేడుకలు



మాట్లాడుతున్న ఆలయ ఈఓ గోపాలరావు, అర్చకులు

గుడివాడటౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేం చేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ గోదాదేవి నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కె.గోపాలరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీన ఈ వేడుకలు ప్రారంభిస్తామన్నారు. ఈ ఉత్సవాలు ప్రారంభమై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమ్మవారి తిరునక్షత్ర వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు రైల్వేస్టేషన్ నుంచి మేళతాళాలు, కోలాట నృత్యాలు, నగర సంకీర్తన ప్రారంభమవుతుందని చెప్పారు. తిరుమంజన పూజా సామగ్రి, శ్రావణ పట్టి(సారె) ఈ ఊరేగింపుతో ఆలయానికి చేరతాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణారావు, అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు, భక్తులు ఎల్.శివప్రసాద్, కోలాట భజన సమాజం సభ్యులు జేవీవీ కుమారి, ఎస్.దుర్గామాత, చిన్నా, పి.హేమ పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణ మాస పూజలు



గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు శ్రావణ మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ముఖ్య అర్చకులు శివ సంతోష్ శర్మ, అసాదు టి.వేంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు సహస్రనామ కుంకుమార్చనలు, ప్రతి శుక్రవారం ఉదయం పంచామృత అభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చనలు సాయంత్రం పంచ హారతులు జరుగుతాయన్నారు. వచ్చే నెల 15వ తేదీన శుక్రవారం ఉదయం 9 గంటలకు మహిళలచే సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తామని చెప్పారు.

మండవల్లి: మండవల్లిలో కొలువైన శ్రీ గంగానమ్మ అమ్మవారికి శ్రావణమాస ప్రారంభం సందర్భంగా శుక్రవారం నుంచి విశేష పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రావణమాసం తొలి ఆదివారం అమ్మవారికి అచ్యుత సోదరులు సారె సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో అమ్మవారికి జలాభిషేకం చేయడానికి భక్తులు తమ ఇంటివద్ద నుంచి కలశాలతో జలం తీసుకురావాలని నిర్వాహకులు కోరారు. కైకలూరు వీధి నుంచి ఉదయం 8:30 గంటలకు భక్తులతో బయలుదేరి సారె సమర్పిస్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశేష అభిషేకాలు



సర్వాలంకార భూషితుడైన జ్ఞానసాయి

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయికి మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో గురువారం వేకువ జామునే వేద పండితులు విశేషాభిషేకాలను చేపట్టారు. అనంతరం సాయికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయ ప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో అన్నసమారాధన

మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న సాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత సాయిబాబా విగ్రహానికి అర్చకులు విశేష పూజలు చేశారు. వల్లభనేని నవీన్ దంపతులు, రేవాన్స్ ఆర్థిక సాయంతో నిర్వహించిన అన్నసమారాధనలో మండవల్లి, గన్నవరం, కొర్లపాడు, పెరికెగూడెం గ్రామాల భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరా వు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మున్సిపల్ పాఠశాలలకు కంప్యూటర్ల అందజేత



కంప్యూటర్లు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

గుడివాడటౌన్: విద్యను ప్రోత్సహించడం సామాజిక సేవ అని ఐడీబీఐ బ్యాంక్ సీజీఎం జానకీరామ్ అన్నారు. పట్టణంలోని 8 మున్సిపల్ పాఠశాలలకు గురువారం ఆయన కంప్యూటర్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఎస్‌పీఎస్, ఆంధ్ర నలంద, బేతవోలు హైస్కూల్, ఎస్‌జీఆర్‌కె ఉన్నత పాఠశాలలతో పాటు 20వ వార్డు ప్రైమరీ స్కూల్ , స్లాటర్ పేట, మోడల్ పబ్లిక్ స్కూల్‌లకు కంప్యూటర్లు అందజేశామన్నారు. సీఎస్ఆర్ ఫండ్ నుంచి సమాజసేవలో బాగంగా వీటిని ఏర్పాటుచేశామని తెలిపారు. వీటి ద్వారా పురపాలక సంఘ విద్యార్థులకు అధునాతనమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలకు అవసరమైన సమాచారం కూడా భద్రపర్చుకో వచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ సాయికృష్ణ, బ్రాంచ్ మేనేజర్ ఆదిశేషకుమార్, ఎంఈఓలు జగన్మోహనరావు, బి. బాలాజీ, హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరరావు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. కొతవరం సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు తీగలపై చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు పామర్రులో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

పామర్రు(మొవ్వ): నియోజకవర్గ కేంద్రం పామర్రులోని బొమ్మారెడ్డి సీతారెడ్డి కల్యాణ మండపంలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పామర్రు మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గం తెలియజేశారు. సమావేశానికి పామర్రు మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రక్తదాన శిబిరం

కైకలూరు: స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత తెలిపారు. రక్తదానంపై గురువారం ఆమె అవగాహన కల్పించారు. ఏలూరు రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్‌క్లబ్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహిస్తారని స్పష్టం చేశారు. విద్యార్థులు అపోహలు వీడి రక్తదానం చేయాలన్నారు. యూత్ రెడ్ క్రాస్ సొసైటీ కాలేజీ సెక్రటరీ ఎం.హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, అధ్యాపకులు నున్న శ్రీనివాసరావు, బి.వేదాంతం పాల్గొన్నారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు

గుడివాడటౌన్: సమాజంలో కొందరు చేసిన త్యాగాలు, మంచి పనులు తరతరాలు మరువలేనివని ఇరిగేషన్ అధికారులు అన్నారు. స్థానిక ఇరిగేషన్ డివిజినల్ కార్యాలయంలో సర్ ఆర్థర్ కాటన్ 126వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. తొలుత అధికారులు ఆర్థర్ కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పూర్తి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండి అనేక రకాల సాంకేతిక పరికరాలు వినియోగంలో ఉన్న ఈ రోజుల్లో ఏళ్ల తరబడి ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, ఏ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని ఆ రోజుల్లో అదిలాబాద్ జిల్లా నుంచి గోదావరి జిల్లాల వరకు గుర్రంపై ప్రయాణిస్తూ కుటుంబానికి దూరంగా ఉంటూ సమాజం కోసం పనిచేసిన గొప్ప వ్యక్తి కాటన్‌దొర అన్నారు. ఆయన నిర్మించిన ధవళేశ్వరం ఆనకట్ట ఒక అద్భుతమని కొనియాడారు. ఆయన మరణించి 126 సంవత్సరాలు పూర్తయినా వారు ఈ ప్రాంతాలకు చేసిన సేవలు వారిని గుర్తుంచుకునేలా చేశాయన్నారు. సర్ ఆర్థర్ కాటన్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ డ్రెయినేజీ బి.కిరణ్‌బాబు, డీఈఈ సూర్య భరత్, డీఈ ఆర్.నాగేంద్రకుమార్, ఏఓ ఎంఎస్ సువర్ణకుమార్, ఏఈలు కె.రాము, పవన్, నాగేశ్వరరావు, ఎం.అరుణ్‌కుమార్, తులిమిల్లి యేషయ్య, ఆర్.బాలరాజు, నీటి పారుదల శాఖ, డ్రెయినేజీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయపు పన్నుపై అవగాహన అవసరం



కళాశాల యాజమాన్యానికి మొక్కలు అందజేస్తున్న ఆదాయపు పన్ను శాఖాధికారులు

గుడివాడటౌన్: ఆదాయపు పన్ను ఆవశ్యకత, ప్రాముఖ్యతపై విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరమని ఆదాయపు పన్ను శాఖ అధికారులు సందీప్, ఆర్ఎస్‌పీ మూర్తి, ఇన్‌స్పెక్టర్‌లు దంటు సురేష్‌బాబు, ఏవీ రవికుమార్ తెలిపారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో ఆదాయపు పన్ను శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను చెల్లించడం భారత పౌరుల బాధ్యత అన్నారు. పన్ను చెల్లింపులు దేశాభివృద్ధికి మూలకారణమని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఆదాయపు పన్ను శాఖపై క్విజ్ నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ఆడిటర్ ఎంఆర్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థర్ కాటన్‌కు నివాళి..

స్థానిక ఏఎన్నార్ కళాశాలలో సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి జరిగింది. కళాశాలలోని కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ బృందం సర్వే



మొవ్వలో సర్వే నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ బృందం

పమిడిముక్కల: మండలంలోని తాడంకి, గురజాడ, వేల్పూరు గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ బృందం గురువారం పర్యటించింది. బృంద సభ్యులు శివ తాడంకి గ్రామంలో, సందీప్ గురజాడలో, శ్రీనివాస్ వేల్పూరులో సర్వే నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, సచివాలయాలు సందర్శించి సేవలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని కొంతమంది గృహ యజమానులతో మాట్లాడి వివరాలు నమోదు చేశారు. పారిశుద్ధ్య, మరుగుదొడ్ల నిర్వహణ, డ్రెయినేజీ సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. తాడంకిలో జరిగిన సర్వేలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీడీఓ వీర్ల సీతారామరాజు, డెప్యూటీ ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి భవాని, సర్వే కో ఆర్డినేటర్లు బాపూజీ, ఏసుబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ బృందం పరిశీలన

కూచిపూడి(మొవ్వ): మొవ్వ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-2025 సభ్యుల బృందం గురువారం పలు ప్రాంతాలను సందర్శించి సర్వే నిర్వహించారు. సర్వేక్షణ్ గ్రామీణ పర్యవేక్షకులు జి రవివర్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ కనపర్తి పవన్ కుమార్ గ్రామంలోని పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీ ఎలిమెంటరీ రెగ్యులర్ పాఠశాల, ఎస్టీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, డ్రెయినేజీలు, పలు గృహాలను సందర్శించి నివేదికల రూపొందించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, శానిటేషన్‌ను పరిశీలించారు. ప్రజల నుంచి గ్రామానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో ఎం.ఎస్. కృష్ణ పరమాత్మ, పంచాయతీ కార్యదర్శి కె.సోమేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏనుగు పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కైకలూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ చెప్పారు. కైకలూరు ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్ నిరోధక చర్యలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు వంటి విషయాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ.. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. సెల్ ఫోన్లలో వచ్చే మోసపూరిత యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలల నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో బాలికలపై ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడితే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కట్టా విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి క్లోరినేషన్ పరీక్షలు



తాగునీటి క్లోరినేషన్ పరీక్షలు చేయిస్తున్న ఎంపీడీఓ ఇమ్రాన్

గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడులోని రక్షిత మంచినీటి పథకం వద్ద తాగునీటిలో క్లోరినేషన్ ఎంతమేరకు ఉందనే విషయమై ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ గురువారం పరీక్షలు చేయించారు. అలాగే వివిధ గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని బ్రోచర్లను చిరు వ్యాపారులకు అందజేశారు. డెప్యూటీ ఎంపీడీఓ ఏజేఎల్ నరసింహారావు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య, తాగునీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై ఆరా..

మండలంలోని వడ్లమన్నాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి పన్నుల వసూలుపై ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ గురువారం ఆరా తీశారు. ట్యాక్స్ డేటా ప్యూరిఫికేషన్ విధానాన్ని పరిశీలించారు. డ్రై వేస్ట్, వెట్ వేస్ట్ సెగ్రిగేషన్ జరుగుతున్న తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ ఏజేఎల్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.